# రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు ఉత్సవంలో పసిడి పలుకులు



హిందూ పత్రికను శ్రీ ఎన్.రావ్ కొత్త పంథాలోకి మళ్ళిస్తే, దానికి జి.కె.రెడ్డి 'పర్' ఫెక్షన్ యిచ్చారు.

—బి.ఎస్.ఆర్.కృష్ణ,
సీనియర్ జర్నలిస్ట్, మద్రాసు

జి.కె.రెడ్డి జర్నలిస్టిక్ చర్చిల్. చర్చిల్ ఆ రోజుల్లో పాలనా యంత్రాంగాన్ని యుద్ధానికి పంపించినట్లు, జి.కె.రెడ్డి దేశాభ్యున్నతికోసం జర్నలిజాన్ని యుద్ధ రంగానికి పంపించారు.

—శ్రీ సెల్వరాజ్,
తమిళనాడు కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్

చదువుకోకుండా అభివృద్ధిలోకి వచ్చినవారు చదువుకున్నవారిపై కొంత ఏహ్యా బావం వుంటుంది. చదవులోని కష్ట సుఖాలేమిటో చదువుకోనివారికి అర్థంకావు. జి.కె.రెడ్డి విద్యార్థులకు, భారతావనికి మార్గదర్శకంగా వుండే రచనలు చేయాలి.



—డాక్టర్ రాజ్యలక్ష్మి,
వైస్ ఛాన్సలర్, శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ

"నేను, జి.కె.రెడ్డి నెల్లూరు వి.ఆర్. కాలేజీలో చదివాం. చదువుతున్న రోజుల్లో ఆయన ఎవ్వరితో చెప్పకుండా బొంబాయి వెళ్ళారు. అక్కడ పత్రికేయుడై కాశ్మీర్ వెళ్ళి ఢిల్లీ వచ్చి స్థిర పడ్డాను. అప్పుడు ఆయన అలా వెళ్ళకపోతే, యిలాంటి జి.కె.రెడ్డి మనకు లభించేవారు కాదు.



—డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి,
మాజీ ఆంధ్ర ముఖ్యమంత్రి,
కేంద్ర మంత్రి, గవర్నర్,
సాహితీ బంధువు

మొదట్లో నాకు ఇంగ్లీషు చదవడం రాదు. అప్పుడు ఇంగ్లీషు నేర్చుకోవడానికి 'హిందూ' పత్రికను కొద్దికొద్దిగా చదవడం నేర్చుకోమని బి.యన్.రెడ్డిగారు సలహా యిచ్చారు. ఇది 1946 నాటి మాట. అప్పటి నుండి నాకుగా నేను కొని చదువుతున్న పత్రిక 'హిందూ' మాత్రమే. అందులో జి.కె.రెడ్డి ఎంతో ఎక్కువ సమాచారాన్ని తక్కువ మాటల్లో భావగర్భితంగా వ్రాస్తుంటారు. ఒక్కొక్కసారి నాలాంటివారు రెండుసార్లు చదివితేకాని అవి అర్థం కావు. అంతటి భాషను ఆయన ఉపయోగిస్తారు. జరగబోయేది కూడా సరిగ్గా చెప్తారు.



—నటసామ్రాట్ శ్రీ అక్కినేని నాగేశ్వరరావు

పత్రికా రచనలో జి.కె.రెడ్డి ఒక ఉద్యమం. ఆయన వార్తలలో స్పెకులేషన్ వుండదు...చాలా సందర్భాలలో ముందుముందు జరగబోయే విషయాలను గురించి వ్రాస్తారు. ఆయన వ్రాసినట్టుగానే జరిగిన సంఘటనలు ఎన్నో వున్నాయి. జి.కె.రెడ్డికి దేశంలో ఎంత పేరున్నదో, విదేశాలలో అంతకు మించిన పేరుప్రఖ్యాతు లున్నాయి. ఆయనను ఒక అత్యుత్తమ పొలిటికల్ ఎనాలిసిస్ట్ అని వారు గుర్తించారు.



—మాజీ కేంద్ర మంత్రి, భారతీయ విద్యాభవన్ ఉపాధ్యక్షులు
శ్రీ సి.సుబ్రహ్మణ్యం

## కాలం దాటని కథ

"రాయల్ జ్యూయలర్స్" నుండి ఆ జంట గబగబా బయటకు వచ్చారు. రిక్షా ఎక్కారు. చాలా స్పీడుగా రిక్షా నడిపించి థియేటర్‌కు వచ్చారు. చాలా రష్‌గా వుంది. అయినా ఆమె రెండు టిక్కెట్లు పట్టుకొచ్చింది. ఇద్దరూ థియేటర్‌లోకి వెళ్ళారు. 'దేశానికి నాథుడు' అనే సినిమా అది. పూర్తి బూతు పాటలు, ద్వంద్వార్థాలు కలిగిన చిత్ర రాజమది. చాలా రష్‌గా వుంది. ఈలలు, కేకలు, నిరోధ్ బెలూన్లు, రకరకాల రంగురంగు కాగితాలు – థియేటరంతా వీర విహారం చేస్తున్నాయి. అటువంటి భీకర వాతావరణంలో ఆ జంట సినిమా చూస్తున్నది.

ఎట్టకేలకు సినిమా ముగిసింది. తోసుకొంటూ–పరు గెత్తుకుంటూ–ఎగురుతూ, గంతులేస్తూ జనం బయటకు రాసాగారు. ఆ జంట నలుగుతూ బయట కొచ్చింది.

వచ్చి రిక్షా ఎక్కి, 'బస్టాండుకు పోనీయ్' అన్నారు. బస్ దగ్గరకు వచ్చి టిక్కెట్లు కొంటానికి జాకెట్టులోనికి చెయ్యి పోనిచ్చింది. అక్కడ పర్సు లేదు. ఆమె గుండె గుభేలు మన్నది. మొత్తం హృదయమంతా తడుముకొన్నది. ఎక్కడా పర్సులేదు, తాము ఇందాక "రాయల్ జ్యూయలర్స్"లో కొన్న దిద్దులు జతా లేదు. మెల్లిగా విషయం భర్తకు చెప్పింది. చిందులు తొక్కాడు. గట్టిగా అరిచాడు. స్త్రీ జనాన్ని, వాళ్ళ సినిమా పిచ్చిని

## సినిమా

వేనోళ్ళుగా దూషించాడు. 'పద, రిక్షా ఎక్కు' అని తిరిగి 'రాయల్ జ్యూయలర్స్' దగ్గరకు వచ్చారు. వారికి జరిగింది చెప్పారు. వారు ఇద్దర్నీ జ్యూయలర్స్ ఎసోసియేషన్ ప్రెసిడెంట్ దగ్గరకు పంపారు. అక్కడ ఒక సర్క్యులర్‌తో అన్ని షాపులకూ నోటీసు పంపితే ఆ దుద్దుల జత ఎవరయినా తీసుకొస్తే పోలీసులకు అప్పజెప్పుతారు షాపులవారు. ఆ జంట జ్యూయలర్స్ ప్రెసిడెంటు గారి దగ్గరకు వచ్చారు. ఆయన రసికరాజు.

జరిగిందంతా చెప్పారు. ఆయన సర్క్యులర్ రాసి–అన్ని షాపులకూ పంపించాడు.

చివరగా ఓ ప్రశ్న వేశాడు.

'అమ్మా పర్సు మీరు ఎక్కడ పెట్టుకొన్నారు?'

ఆమె సిగ్గుపడి జాకెట్టు చూపింది.

"అక్కడ ఉన్న పర్సు తీశాడంటే వాడు సామాన్యమైన దొంగ కాదమ్మా! చాలా స్కిల్ గలవాడై వుంటాడు" అన్నాడు రసికరాజు.

"వాడి బొంద స్కిల్. ఈ ఆడోళ్ళకి సినిమా పిచ్చి వుండే... అది వంటిమీద గుడ్డకూడా నిలవనీయటం లేదండీ" అన్నాడు భర్త కోపంగా. అతనికి ప్రొద్దున చెల్లించిన రొక్కం పదహారు వందలు గుర్తుకొచ్చింది.

ఆమె వెంటనే కోపంగా 'ఆ మాత్రం నాకు తెలియకపోలేదు. కానీ ఆ పని చేసింది మీరు అనుకొన్నాను. పర్సుతో మీకేం పని అనుకొన్నాను...' అంది.

భర్త తెల్లబోయాడు.

'రసికరాజు' ఆనందించాడు.

ఆమె – పాపం – పగటు స్త్రీ!

(ఇది జరిగిన కథ) —ప్రసాదార్య